క్లుప్తంగా

పీఐఎంఈ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తరించాలి



ఫాదర్ జేవియర్‌ను సన్మానిస్తున్న దుగ్గిరాల సంఘస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పీఐఎంఈ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు విస్తరించాలని పీఐఎంఈ ఆసియా రీజనల్ సుపీరియర్‌గా ఎన్నికైన రెవరెండ్ ఫాదర్ అంబటి జేవియర్‌ను దుగ్గిరాల గ్రామానికి చెందిన సంఘకాపరి తోట ఎడ్వర్డ్ కోరారు. గతంలో ఏలూరులో పీఐఎంఈ సుపీరియర్‌గా పని చేసిన అంబటి జేవియర్ ఇటీవల ఇటలీలో జరిగిన కార్యక్రమంలో ఆసియా రీజనల్ సుపీరియర్‌గా ఎన్నికయ్యారు. బుధవారం ఏలూరు నగరానికి విచ్చేసిన జేవియర్‌ను దుగ్గిరాల సంఘస్తులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిద్దునూరి ఫ్రాన్సిస్, పుల్ల ఆదాము, చట్టుమాల ప్రణయ్, సీహెచ్. కళ్యాణ్, సరిహద్దు చిన్న సంఘ పెద్దలు పాల్గొని జేవియర్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఏలూరు టౌన్: విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమవుతుందని, పేద విద్యార్థిని ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేసిన హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అభినందించారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు చేతులమీదుగా విద్యార్థినికి బుధవారం ఏలూరులో ఆర్థిక సాయం అందజేశారు. వివరాల ప్రకారం ఏలూరు దొండపాడు ప్రాంతానికి చెందిన అర్జీ హేమ హర్షిత అనే విద్యార్థిని ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటుకుని 980 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఆమె బీటెక్ మొదటి ఏడాది సైబర్ క్రైమ్ విద్య అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విద్యార్థిని హర్షితకు హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్‌ను సంప్రదించి తన చదువుకు ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నాననీ, అండగా నిలబడాలని కోరటంతో వెంటనే స్పందించిన హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థినికి రూ.54వేల ఆర్థిక సహాయాన్ని అందశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ చందన వెంకట్, హిమబిందు ఉన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ఎప్పుడు?

కూటమి ప్రభుత్వ తీరుపై భవన నిర్మాణ కార్మికుల ఆగ్రహం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు(ఫైల్)



క్లెయిమ్ కోసం ఎదురు చూస్తున్న బిల్డింగ్ పైనుంచి జారిపడిన తాపీ మేస్త్రీ చల్లా ప్రసాద్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం వివిధ నిర్మాణ రంగ కార్మికులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులుడిమాండ్ చేస్తున్నారు. తాము అధికారం చేపడితే భవని నిర్మాణ రంగ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కార్మికుల సంక్షేమ బోర్డుకు తన సొంత నిధులు రూ.కోటి జమ చేస్తానని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఆ హామీలను తుంగలోకి తొక్కడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం చేపట్టి 15 నెలలు దాటినా నేటి వరకు సంక్షేమ బోర్డు ఊసే ఎత్తకు పోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఇప్పటికై వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అయా మండల తహసీల్దార్ల కార్యాలయాల వద్ద కార్మికులు ధర్నాలు నిర్వహించారు. తమ ఆందోళనలో భాగంగా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళ చేపట్టేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తక్షణం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు పోరు బాట పట్టారు.

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకు ప్రమాదాల్లో గాయపడిన వారికి నష్టపరిహారం అందుతుంది. కార్మికుల పిల్లల చదువులకు, వివాహాలకు కానుకల రూపంలో డబ్బులు అందించే వెసులు బాటు ఉంటుంది. ప్రస్తుతం కార్మిక సంక్షేమ బోర్డు పని చేయకపోవడం వల్ల కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి రావాల్సిన క్లెయిములు చెల్లించకపోవడం వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల కొలది క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ రంగ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లివే..

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి.
- పెండింగ్ క్లైయిమ్‌లను పరిష్కరించాలి.
- భవన నిర్మాణ కార్మికులు వయస్సు రీత్యా పనిచేయలేని వారికి, పనిచేస్తూ ప్రమాదాలకు గురై అంగవైకల్యం చెందిన వారికి సంక్షేమ బోర్డు నుండి పింఛన్ సౌకర్యం కల్పించాలి.
- ఉచిత ఇసుక గృహ యజమానులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.
- సిమ్మెంట్, ఇటుక, ఐరన్, చిప్స్ తదితర మెటీరియల్ ధరలు అరికట్టాలి.

ఏదైనా ప్రమాదం జరిగితే అంతే



సంక్షేమ బోర్డు అమల్లో ఉంటే ఏదైనా అనుకోని సందర్భాల్లో ప్రమాదాలు జరిగితే రూ.30 వేల వరకు పరిహారం చెల్లించేవారు. దీంతో కొద్ది రోజులు పనికి వెళ్లలేక పోయినా కుటుంబ జీవనానికి ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం సంక్షేమ బోర్డు అందుబాటులో లేకపోవడంతో తాపీ కార్మికులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందడం లేదు.

– పుప్పాల భాస్కరరావు,తాపీ మేస్త్రి, దోసపాడు,దెందులూరు మండలం

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి



సంక్షేమ బోర్డు అమలులో లేకపోవడం వల్ల జిల్లాలో వేల క్లైయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్ల క్రితం నా కుమార్తె డెలివరీ నిమిత్తం బోర్డు నుంచి డబ్బులు రావాల్సి ఉంది. ఈ క్లైయిమ్ రెండేళ్ల నుండి పెండింగ్‌లో ఉంది. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి.

– సొంగ రంగారావు,సెంట్రింగ్ కార్మికుడు,ఏలూరు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



భవన నిర్మాణ రంగ కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించాలి. కార్మికులకు కొద్దో గొప్పో అక్కరకు వచ్చే సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం పట్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా కూటమి ప్రభుత్వం తక్షణం సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లైయిమ్‌లన్నింటినీ పరిష్కరించి, కార్మికులను ఆదుకోవాలి.

– పి.కిషోర్,ఏఐటీయూసీ జిల్లా నాయకులు,ఏలూరు

సింగపూర్ అధ్యయన బృందంలో తేరా ప్రసాద్



తేరా ప్రసాద్‌ను సత్కరిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

దెందులూరు : సింగపూర్ దేశంలో విద్యావిధానం అధ్యాయనం బృందానికి ఏలూరు జిల్లా నుంచి మనూరు పాఠశాల హెచ్ఎం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తేరా ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం డీఈఓ వెంకటలక్ష్మమ్మ ఆమె కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష రవికుమార్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బంటు మోహనరావు, జిల్లా సీఈఓ బోర్డు కార్యదర్శి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి కాలేజీ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ – సైబర్ నేరాలు, పోస్కో యాక్ట్, సైబర్ ఫ్రాడ్, మహిళలపై జరుగుతున్న అత్యాచార కేసులను గురించి, శక్తి యాప్ గురించి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలను ఇప్పటికే ర్యాగింగ్ రహిత ప్రాంగణంగా ప్రకటించామని, ర్యాగింగ్ నిర్మూలించడానికి యాంటీ ర్యాగింగ్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం అధ్యాపక బృందం మానిటరింగ్ చేస్తూ ర్యాగింగ్ జరుగకుండా కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. కరస్పాండెంట్ కె.హరిరామ కృష్ణంరాజు, ఏలూరు 3 టౌన్ ఇన్స్‌పెక్టర్ వి.కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వైద్య అధికారి డాక్టర్ పీజే అమృతం

దెందులూరు: అవగాహన, అప్రమత్తత ద్వారానే క్యాన్సర్‌ను ఎదుర్కోగలమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పీజే అమృతం అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలోని ఆశ్రం ఆసుపత్రిలో ఆశ్రం క్యాన్సర్ కేర్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అతిథిగా హాజరైన జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ పీజే అమృతం మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ ప్రస్తుత రోజుల్లో ఎక్కువగా ప్రబలుతుందని, అవగాహన లేకపోవడం వలన చాలా మంది స్త్రీలు ఇబ్బందులు పడి, ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నామని, అవగాహనే ఆయుధమన్నారు. ఆశ్రం హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ కె. హనుమంతరావు, మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ సింధు, డాక్టర్ సారధి, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శైలజ, డాక్టర్ చంద్ర శేఖర్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కణ్మణి, డాక్టర్ మౌనిక, డాక్టర్ ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం



హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జిల్లా ఎస్పీ శివకిశోర్

ఏలూరు టౌన్: ఏలూరు పర్యటనలో భాగంగా నగరానికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్‌రెడ్డికి ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఘన స్వాగతం పలికారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో కేసులు, ఇతర అంశాలపై వారిలో కొద్దిసేపు చర్చించారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డిలను ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, రెండో అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ, ఏడవ అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, పోక్సో స్పెషల్ జడ్జి కే.వాణిశ్రీ, పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి, జిల్లాలోని న్యాయమూర్తులు, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల మృతికి సంతాపం



బాబి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ కార్యకర్త కొట్టేటి వెంకట రమణ (బాబీ) బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసిన నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, స్థానిక నాయకులు రమణ ఉన్నారు.

దాకవరపు శాంతి మృతికి సంతాపం

ఏలూరు వైఎస్సార్ సీపీ కార్యకర్త దాకవరపు రవి మరదలు దాకవరపు శాంతి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లమూడి సునీల్‌కుమార్, బంకపల్లి రాము, తానంకి బాబి, కల్లెం గిరిరాజు, గంట ఏసురత్నం ఉన్నారు.

చేతికర్ర ప్రాముఖ్యతపై అవగాహన



సదస్సులో పాల్గొన్న వైద్యులు,డీబీఆర్‌సీ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ – టెక్నికల్ సొసైటీ, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నేత్ర వైద్యం విభాగంలో ప్రపంచ తెల్ల చేతికర్ర దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అసిస్టెంట్ ప్రొఫెస్సార్స్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ అరుణ మాట్లాడుతూ అంధులు (దృష్టి లోపం ఉన్నవారు) తమ రోజువారీ జీవితంలో స్వాతంత్ర్యంగా ఆత్మవిశ్వాసంతో సురక్షిత ప్రయాణాన్ని సాధించేందుకు తెల్ల చేతికర్ర దోహదపడుతుందని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	బీక్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	34
బెండకాయలు	32	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	38	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	48
బీరకాయలు	28	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

చిన్న సినిమాలు అధిక సంఖ్యలో తీయాలి



క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభిస్తున్న అంబికా కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చిన్నచిన్న సినిమాలను అధిక సంఖ్యలో తీయడానికి ఔత్సాహిక నిర్మాతలు ముందుకురావాలని ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ సూచించారు. మెగా మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం1–గా శ్యామ్ వట్టి నిర్మాతగా నూతన నటీనటులు జాలా అరవింద్, పవిత్ర నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాలతో బుధవారం స్థానిక సత్రంపాడు అంబికా దేవి ఆలయంలో లాంచనంగా ప్రారంభమైంది. వెంకట్ జుత్తిగ దర్శకత్వంలో ముహూర్తపు సన్నివేశానికి అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నటులు ఆమని, శుభలేఖ సుధాకర్, గౌతమ్ రాజుతో పాటు మరో 25 మంది నటిస్తున్నారన్నారు. మార్చిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని డైరెక్టర్ వెంకట్ తెలిపారు.

ఐఎఫ్‌టీయూ రాజకీయ తరగతులను జయప్రదం చేయాలి

ఏలూరు (టూటౌన్): నవంబరు 1,2,3,4 తేదీలలో ఏలూరులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు బి.సోమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం పవర్ పేట ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో యూవీ, బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు

ఏలూరు (టూటౌన్): చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం ఏలూరు అశోక్ నగర్‌కు చెందిన చిట్టిబోలు బలరామ్ గతంలో ఈవెంట్ ఆర్గనైజర్‌గా పని చేసేవారు. ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరంలో ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఏలూరులో ఉన్న సమయంలో అతను తన కుటుంబ అవసరాల నిమిత్తం నగరానికి చెందిన ఎం.సుధాకరరెడ్డి వద్ద 2022, జూలైలో రూ.6లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ బాకీ తీర్చే నిమిత్తం 2023, ఆగస్టులో రూ.4.50లక్షల చెక్కును సుధాకరరెడ్డికి అందజేశారు. ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడు సుధాకరరెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులో విచారణ చేపట్టారు. చెల్లని చెక్కు ఇచ్చిన నేరం రుజువు కావడంతో చిట్టిబోలు బలరామ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పాటు రూ.4.50 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసులో బాధితుడి పక్షాన న్యాయవాది ఏవీఎస్ సూర్యారావు కేసు వాదించారు.

ప్రధాని సభకు 20 బస్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కర్నూలులో సూపర్ జీఎస్‌టీ– సూపర్ సేవింగ్స్ పేరిట గురువారం నిర్వహిస్తున్న సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా నుంచి వీఐపీలను, పారిశ్రామికవేత్తలను, ట్యాక్స్‌పేయర్లను తరలించడానికి అధికారులు 20 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఏలూరు డిపో నుంచి 13 బస్సులను, నూజివీడు డిపో నుంచి 7 బస్సులను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతాలకు వెళ్లే బస్సులు వస్తాయని ఎదురు చూసిన ప్రయాణికులకు సర్వీసులను రద్దు చేసినట్టు అధికారులు చెప్పడంతో అష్టకష్టాలుపడుతూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు.

18న జిల్లాస్థాయి క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 బాల బాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్– 14, 17 బాలబాలికల స్కేటింగ్, జూడో ఏలూరు ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అండర్– 14,17 బాలబాలికలకు సాఫ్ట టెన్నిస్, స్క్వాష్ ఎంపిక పోటీలు లింగపాలెం మండలం కలరాయన గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి జరుగుతాయని వివరించారు. అండర్ 14 జట్లకు వచ్చే విద్యార్థులు 2012 జనవరి 1వ తేదీ కానీ ఆ తరువాత కానీ పుట్టి ఉండాలని పేర్కొన్నారు. అలాగే అండర్ 17 జట్ల ఎంపికకు వచ్చే విద్యార్థులు 2009 జనవరి 1న, కానీ ఆ తరువాత గానీ పుట్టి ఉండాలని సూచించారు. క్రీడాకారులు విధిగా జిల్లా స్థాయి ఎంట్రీ ఫారాలను తాము చదువుతున్న స్కూల్ / కాలేజ్ ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్స్‌పాల్స్ సంతకాలతో అందచేయాలని, లేని పక్షంలో ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అనర్హులని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 9030894311, 81433096604 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.